చంద్రశేఖర్‌కు హరి మొహం.. మగవాడి రూపం నుంచి ఆడ రూపంగా మారుతూ కనిపించింది. గుండె కండరం నుంచి రాయిగా మారడానికి పెద్దగా సమయం పట్టలేదు. శారద చేతిలోని ఫోన్ తీసుకొని నేలకేసి కొట్టి.. విసురుగా బయటికి వెళ్లిపోయాడు.

చంద్రం ఏం చేసినా.. హరి ఏం చెప్పినా.. శారద నిశ్శబ్దంగా ఉంటుంది. ఎందుకంటే.. ఆమె గుండె రాయిగా మారి చాలా రోజులైపోయింది. ఒంటరిగా ఉన్నప్పుడు, ఆ రాయి పగిలి అందులోంచి ఏ మాత్రం రుచించని నీరు బయటికొచ్చి.. ఆమె చీర కొంగును తడుపుతుంది.

* * *

రెండు రోజులుగా ఆ ఇంట్లో మాటల్లేవు. శారదకు మాత్రం హరితో మాట్లాడాలని ఉంది. చంద్రానికి కూడా కాస్తా సమయం ఇద్దామని ఆగింది. ఇద్దరు ఎదురెదురుగా కూర్చొని తింటున్నారు.

''ఒకసారి ఫోన్ ఇవ్వండి, హరితో మాట్లాడాలి''.

''శారదా! నన్ను కాస్త ప్రశాంతంగా బతకనివ్వు!''.

''వాడు చేసిన తప్పేంటి?''.

''శారదా! వాడిప్పుడు ఆడదానిలా మారతాడు. అది నాకు ఇష్టంలేదు''..

''అదే విషయం వాడితో మాట్లాడు.. వాడు ఏం అంటాడో విందాం. తర్వాత నీ ఇష్టం!''.

చంద్రశేఖర్ కాసేపు ఆలోచించి ఫోన్ ఇచ్చాడు.

''హలో.. డాడీ!''.

''హరీ!''.

''అమ్మా.. ఏమైపోయావ్!? రెండు రోజులనుంచి నీ ఫోన్ కలవట్లేదు''..

''నువ్వు ఫోన్ చేసినప్పుడు మీ నాన్న పక్కనే ఉన్నాడు. ఇప్పుడు కూడా ఉన్నాడు''.. కాస్త ఆగి,

''నీవు ట్రాన్స్‌జెండర్‌గా మారడం ఆయనకు ఇష్టం లేదు''.. కొంచెం కఠినంగానే చెప్పింది.

''అమ్మా.. ప్లీజ్! ఇన్నాళ్లూ గొంగళి పురుగులా బతికా నమ్మా! ఇవ్వాళ నాలో ఓ సీతాకోకచిలుక ఉందని తెలిశాక.. నా రూపం నాకు నచ్చట్లేదమ్మా!''.. చిన్నప్పుడు చాక్లెట్ కోసం బతిమాలినట్టు బతిమాలుతున్నాడు.

''అంటే.. నేనిచ్చిన రూపం నీకు నచ్చట్లేదా హరి!?''.. ఆమె గొంతే కాస్త జీరబోయింది.

''అలా కాదమ్మా! ఇది నువ్విచ్చిన రూపమే! ఇన్ని రోజులూ కొడుకులా బతికా, ఇకపై కూతురిలా బతుకుతా!''.. ఇదే చివరి కోరికన్నట్టుగా బతిమాలుతున్నాడు.

ఇటు.. చంద్రశేఖర్ మాత్రం పరువుకీ – బతుక్కీ మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. శారద చెప్పిన మాటలు ఓ వైపు.. సమాజం ఛీత్కరించే మాటలు ఓ వైపు..

''హరీ!''.

''డాడీ!''.

''మనసు మార్చుకున్నంతా తేలిక కాదు.. శరీరాన్ని మార్చుకోవడం!''.

''ఇక్కడ కొన్ని ఆర్గనైజేషన్‌లు ఉన్నాయి డాడీ. నాకు తెలిసిన స్పెషలిస్ట్‌లు ఉన్నారు. సర్జరీ తర్వాత వన్‌మంత్ ఇబ్బంది ఉంటుంది. అంతే! కానీ డాడీ.. వైద్యశాస్త్రంలో ఎన్ని మందులు వచ్చినా.. అవి శరీరానికే! నా మనసుకు మందు మాత్రం మీరే!''.. ఆ మాటలు సూదిలా చిన్నగా కపాలం దాటి మెదడులోకి దిగాయి. అక్కడనుంచి న్యూరాన్స్ పరుగెత్తి గుండెను కదిలించాయి.

''సరే అయితే.. జాగ్రత్త!''.

''థాంక్స్ డాడీ.. థాంక్ యు సో మచ్!''..

''హరీ!.. నీవు ఎవరైనా అబ్బాయిని ఇష్టపడ్డావా!?''.

శారద ఆశ్చర్యంగా చూసింది. పాత చంద్రం కనిపించాడు. ఏదైనా పని భుజానికి వేసుకున్నాడు అంటే.. అది పూర్తయి తీరాల్సిందే!

''లేదు డాడీ! కాకపోతే.. అందరిలాగే నాకూ పెళ్లి చేసుకోవాలని ఉంది''.

చంద్రం ఆలోచనలో పడ్డాడు.

''డాడీ.. ఒకవేళ మీకు అమ్మాయి పుడితే ఏం పేరు పెట్టేవారు?''.

''రమ్య!''.

* * *

'మా కొడుక్కి వరుడు కావలెను'.

పేపర్‌లో ప్రకటన. అన్ని వివరాలతోపాటు, చంద్రశేఖర్ నంబర్ కూడా ఉంది. ఆ ప్రకటన చూసి చాలా మంది గేలి చేస్తూ సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. 'ఎయిమ్స్ నుంచి ట్రాన్స్‌జెండర్ దాకా' అంటూ టీవీల్లో ప్రోగ్రామ్స్ కూడా నడిచాయి. బంధువుల నుంచి, ఫ్రెండ్స్ నుంచి తిడుతూ చాలా ఫోన్స్ వచ్చాయి. చంద్రశేఖర్ అన్నిటికీ సమాధానం ఇస్తున్నాడు. అప్పుడే రఘునాథం ఫోన్ చేశాడు.

''చెప్పు.. రఘు!''.

''ఏరా.. మీవాడికి మా అమ్మాయిని కట్టబెట్టరా అన్నా.. వినలేదు. ఇప్పుడు చూడు ఏమైందో!? పోనీ.. మీ అమ్మాయిని మావాడికి ఇస్తావా!?''.. వెటకారం.. పాలు పొంగినట్టు పొంగిపోతున్నది.

''నేను మళ్లీ.. చెప్తున్నా! నా కూతురికి ఇష్టం అయితేనే చేస్తా.. ఏ సంబంధం వస్తే అది చేయడానికి కాదు. తనకి నచ్చితేనే చేస్తా. నేను ఆ ప్రకటన ఇచ్చింది.. రేపు నా కూతురు ఇంటికి వచ్చినప్పుడు బయటికి వెళ్లాలంటే భయపడకూడదు. ఆ అవమానాలు.. ఇబ్బందులేవో మేమే పడతాం. నువ్వు కూడా నీ పిల్లలకి ఇష్టమైతేనే చేయి'' అంటూ ఫోన్ పెట్టేశాడు.

తర్వాత ఒక యూట్యూబ్ చానెల్ వాళ్లు చంద్రశేఖర్‌ను ఇంటర్వ్యూ చేశారు.

''ఒకప్పుడు మీ కొడుకు, ఇప్పుడు మీ కూతురికి పెళ్లి చేయాలి అనుకుంటున్నారు. సమాజం దీన్ని ఎలా అర్థం చేసుకోవాలి?''.

''ఈ సమాజం ఒప్పుకొన్నా.. ఒప్పుకోకపోయినా నేను ఈ పెళ్లి జరిపిస్తా. అది కూడా చాలా ఘనంగా.. మీరు ఏ పేరుతో పిలిచినా సరే, పుట్టింది ఆడైనా మగైనా.. ముందు నా బిడ్డ! ఈ సమాజం ఎప్పుడైనా మార్పును మొదట తిరస్కరిస్తుంది. కానీ, అర్థం చేసుకుంటుంది. దాన్ని ఆపడం ఎవరివల్లా కాదు. మహా అయితే కాస్తా లేట్ అవ్వొచ్చు. కాలమైనా.. మనిషైనా.. శక్తయినా.. రూపాంతరం చెందాల్సిందే! అది ప్రకృతి నియమం. దాన్ని ఆపాలనుకోవడం మూర్ఖత్వం. అలాగే, ప్రేమ కూడా రూపాంతరం చెందుతుంది. దాన్ని కాపాడుకోవాలి. సమస్య కూడా రూపాంతరం చెందుతుంది. దాన్ని ఎదుర్కోవాలి''.

ఇంత జరుగుతున్నా శారద అస్సలు తలదూర్చలేదు. కూతురు ట్రీట్‌మెంట్‌ను చూసుకుంటూ ఉంది. కొన్ని రోజులకు దీనిపై చర్చ తగ్గింది. రమ్య ఇంటికి వచ్చింది. తనకి ఎవరూ నచ్చలేదని పెళ్లిని పక్కన పెట్టి.. హాస్పిటల్ పెట్టాలని అనుకుంది.

* * *

ఇండియాలో హాస్పిటల్ పెట్టడం అంతా తేలికైన విషయం కాదని తెలవడానికి, వాళ్ల చెప్పులను చూస్తేనే అర్థమవుతుంది. పైగా ఇంకో రెండు నెలల్లో ఎలక్షన్స్. అందరూ ఆ హడావుడిలోనే ఉన్నారు. అప్పటి ఎమ్మెల్యే రాజవర్ధనే.. ఇప్పటి ఆరోగ్యశాఖ మంత్రి. అతణ్ని కలవడానికి వెళ్లారు. లోపలికి రానివ్వలేదు.

మంత్రి బయటికి వెళ్తుంటే..

''సర్.. సర్!'' అంటూ చంద్రశేఖర్ అడ్డం వెళ్లాడు.

మంత్రి కాస్త చిరాకుగా చూశాడు.

''సర్.. నా కూతురు రమ్య హాస్పిటల్ పెట్టాలనుకుంటున్నది. ఏదైనా సాయం కావాలంటే మీరే అడగమన్నారు''.. అంటూ గతాన్ని గుర్తుచేశాడు.

మంత్రి రమ్య వైపు తిరిగి..

''అటూఇటూ కాని మనిషితో హాస్పిటల్ పెట్టిస్తే.. ప్రజల ప్రాణాలు ఎటూ కాకుండా పోతయి. పోయి.. ట్రైన్‌లో చేతులు చరుస్తూ అడుక్కోపో.. నీవల్ల, మీ నాన్న వల్ల ఇప్పటికే నియోజకవర్గం పరువంతా పోయింది'' అంటూ వెళ్లిపోయాడు.

రమ్యకు మత్తుమందు ఇవ్వకుండా, నిలబెట్టి సర్జరీ చేసినట్టు అనిపించింది. చంద్రం వెళ్తున్న మంత్రి కారునే చూస్తూ ఉన్నాడు.

''డాడీ.. నేను ఎమ్మెల్యేగా పోటీ చేద్దాం అనుకుంటున్నా''.. చంద్రం ఆశ్చర్యంగా చూశాడు.

''రాజకీయాల్లో నెగ్గుకురావడం చాలాకష్టం. పైగా ఇంకా ఎక్కువ అవమానాలు పడాల్సివస్తుంది''.

''ప్రచారంలోనే వైద్యం చేద్దాం. గెలవడం కోసం కాదు నాన్న.. వైద్యం కోసం! నా అస్తిత్వం కోసం! నాలాంటి వాళ్ల ఉనికి కోసం!''.

'పిల్లలకు రూపంతో పాటు పోరాడే లక్షణాన్ని ఇవ్వండి. ఎందుకంటే, సమస్య ఎప్పుడూ తీరదు. అది రూపాంతరం చెందుతుంది. ఒక సమస్య తీరితే.. ఇంకో సమస్య వస్తుంది. దాన్ని ఎదుర్కొంటూనే సంతోషాన్ని వెతుక్కోవాలి. జీవితం ఒక పోరాటం. జీవితమైనా.. పోరాటమైనా.. మరణంతోనే ముగుస్తుంది!'.. ఆలోచనల్లోనే రమ్యను దగ్గరికి తీసుకున్నాడు చంద్రశేఖర్. ■

## చింతకింది శివశంకర్



పిల్లలకు రూపంతోపాటు పోరాడే లక్షణాన్ని ఇవ్వాలని చెబుతున్నారు రచయిత చింతకింది శివశంకర్. ఎందుకంటే.. సమస్య ఎప్పుడూ తీరదనీ, అది ఎల్లప్పుడూ 'రూపాంతరం' చెందుతూనే ఉంటుందని అంటున్నారు. 'రూపాంతరం' కథా రచయిత శివశంకర్ స్వస్థలం నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం అంబట్‌పల్లి గ్రామం. బీటెక్ (ఈసీఈ) తర్వాత సైయంట్, ఇన్ఫోసిస్ సంస్థల్లో టెలికామ్ ఇంజినీర్‌గా ఐదేళ్లు పనిచేశారు. సాహిత్యంపై మక్కువతో 2021 నుంచి కథలు, కవితలు రాస్తున్నారు. ఈయన మొదటి కథ.. 'స్వాతంత్ర్యం'. లోక కళ్యాణం, కథలు కల్పితం కాదు, ఏ దేశమేగినా – ఎందుకాలిడినా.. అంటూ పదికి పైగా కథలు రాశారు. 'విషన రుడు' కవితా సంపుటిని ప్రచురించారు. నమస్తే తెలంగాణ – ముల్కనూరు ప్రజా గ్రంథాలయం నిర్వహించిన కథల పోటీలలో బహుమతి పొందడం ఇది వరుసగా మూడోసారి. ఇంతకుముందు వరకు స్వాతంత్ర్యం, బొంద లగడ్డ కథలకు బహుమతులు అందుకున్నారు. 'చరిత కామాక్షి' సినిమా, 'గప్‌చుప్' అనే వెబ్ సిరీస్‌కు రచయితగా పనిచేశారు. 'అసుర తెలుగు పాడ్‌కాస్ట్'ను నిర్వహిస్తున్నారు.